సీబీఎస్ఈ 12వ ఫలితాల్లో 99% పాస్

- జాతీయ స్థాయిలో తెలంగాణ రెండో స్థానం
- సీబీఎస్ఈ పది ఫలితాలు కూడా విడుదల

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : సీబీఎస్ఈ 12, 10వ తరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో ఈ సారి రికార్డుస్థాయిలో 99.73% ఉత్తీర్ణత నమోదయ్యింది. జాతీయంగా ఇదే రెండో అత్యధిక ఉత్తీర్ణత. రాష్ట్రం నుంచి బాలురు 99.6%, బాలికలు 99.80% పాస్ అయ్యారు. మన రాష్ట్రం నుంచి 146 పాఠశాలలకు చెందిన మొత్తం 8,477 మంది ఫీజు చెల్లించగా, 8,443 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 8,420 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. రాష్ట్రాల వారీగా తీసుకుంటే మేఘాలయ 100%, తెలంగాణ 99.73%, ఏపీ 99.51%, కేరళ 99.32% ఉత్తీర్ణతతో టాప్ నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు నిర్వహించారు. జాతీయంగా 16,92,794 మంది పరీక్షలు రాయగా 14,96,307 మంది ఉత్తీర్ణులయ్యారు. సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు 99.83% ఉత్తీర్ణులయ్యారు. 51,521 మంది పరీక్ష రాయగా 51,433 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 99.86%, బాలురు 99.80% ఉత్తీర్ణులయ్యారు.

సీబీఎస్ఈలో నూ నారాయణ ప్రభంజనం

హైదరాబాద్ మే 13 (నమస్తే తెలంగాణ): నారాయణ ప్రభంజనం కొనసాగుతున్నది. ఇప్పటికే ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లోనూ ప్రతిభ కనబరిచారు. అత్యధిక బ్రాంచిల్లో 100% విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 10వ తరగతిలో ముగ్గురు 500కు 498 మార్కులు, 12వ తరగతిలో ఇద్దరు 500కు 498 మార్కులు, మరో ఇద్దరు 493 మార్కులు సాధించారు. 10వ తరగతిలో 17 మంది విద్యార్థులు 495కిపైగా మార్కులు, 111మంది 490కిపైగా మార్కులు, 12వ తరగతిలో ఇద్దరు 495 మార్కులు, 17మంది 490కి పైగా మార్కులు, 51మంది 485కిపైగా మార్కులు, 113 మంది 480కి పైగా మార్కులు సాధించినట్టు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పీ సింధూర నారాయణ తెలిపారు. 41 బ్రాంచీల్లో 100% విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. పరీక్ష ఏదైనా నారాయణ విద్యాసంస్థల విజయ పరంపర కొనసాగుతున్నదని గుర్తు చేశారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల వల్లనే అద్భుత విజయాలు సాధిస్తున్నట్టు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర కే పునీత్ అభినందించారు.

25న పాలిసెట్ ఫలితాలు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ పాలిసెట్ ఫలితాలు ఈ నెల 25న విడుదలకానున్నాయి. అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. మంగళవారం పాలిసెట్ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. 1,06,716 మంది దరఖాస్తు చేసుకోగా 98,858 మంది పరీక్షకు హాజరైనట్టు సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య ప్రకటనలో తెలిపారు. బాలురు 92.84%, బాలికలు 92.4% చొప్పున పరీక్షకు హాజరైనట్టు ఆయన వెల్లడించారు.

నేటి వరకు ఇంటర్ ఫీజు చెల్లింపునకు చాన్స్

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు అధికారులు మరో అవకాశం ఇచ్చారు. రూ. 2,500 ఆలస్య రుసుముతో బుధవారం సాయంత్రం వరకు ఫీజు చెల్లించే అవకాశం కల్పించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు 22 నుంచి 29 వరకు జరగనున్నాయి.

20 వరకు ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : రెండేండ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ బీ వెంకట్రామ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుము లేకుండా అభ్యర్థులు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జూన్ 1న ఎడ్‌సెట్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బీటెక్ ఫీజుల పెంపుపై అభ్యంతరం

- ఏ ప్రాతిపదికన ఇంత ఫీజు పెంచారు ?
- టీఏఎఫ్ఆర్సీని నిలదీసిన సర్కారు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో బీటెక్ కన్వీనర్ కోటా ట్యూషన్ ఫీజుల పెంపు ప్రతిపాదనలపై సర్కారు అభ్యంతరం వ్యక్తంచేసింది. ఏ ప్రతిపాదికన ఇంత మొత్తంలో ఫీజులు పెంచారని.. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) వర్గాలపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. బీటెక్ ఫీజుల పెంపు ప్రతిపాదనలపై సర్కారు మంగళవారం సమీక్షించింది. మాసాబ్‌ట్యాంక్‌లోని టీఏఎఫ్ఆర్సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, టీఏఎఫ్ఆర్సీ చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టారెడ్డి హాజరయ్యారు. ఒకేసారి అసాధారణంగా రూ. 50-60వేలు ఫీజులు పెంచడం.. కొన్ని కాలేజీల్లో ఏడాది ఫీజు రెండు లక్షలుండటంపై కారణాలను ఆరా తీసింది. సెయింట్ మేరిస్ సహా మరో రెండు కాలేజీల్లో ఫీజులను ఏ ప్రతిపాదికన పెంచారని, పెంచేందుకు దారితీసిన పరిస్థితులపై వివరణ అడిగింది. సర్కారు ప్రశ్నలకు టీఏఎఫ్ఆర్సీ అధికారుల నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. మళ్లీ సమావేశం నిర్వహించేలోగా ఎంత వీలైతే అంత ఫీజులు తగ్గించాలని ఆదేశించినట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి.

16న సీడీపీవో సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : మహిళా శిశు సంక్షేమ శాఖలో సీడీపీవో పోస్టుల భర్తీలో భాగంగా ఈనెల 16న రెండో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటనలో తెలిసింది. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఈ వెరిఫికేషన్ జరుగుతుందని, వెరిఫికేషన్‌కు హాజరయ్యే వారి వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. డివిజినల్ అకౌంట్ ఆఫీసర్(డీఏవో) విత్‌హెల్డ్ ఫలితాలను సైతం టీజీపీఎస్సీ అధికారులు విడుదల చేశారు. రెండు పోస్టుల ఫలితాలను విత్ హెల్డ్‌లో పెట్టగా, ఆయా పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ లిస్టును కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకు మళ్లీ అనుమతి

10 లక్షల సార్లు గోవింద కోటి రాస్తే వీఐపీ బ్రేక్ దర్శనం : టీటీడీ

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చే సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సిఫారసు లేఖలను తాత్కాలికంగా పక్కనపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ నెల 15 నుంచి లేఖలను తిరిగి అనుమతించాలని టీటీడీ నిర్ణయం తీసుకున్నది. మరోవైపు 10,01,115 సార్లు గోవింద కోటి రాసిన వారికి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించనున్నారు. 25 ఏండ్ల వయసు లేదా అంతకంటే తక్కువ వయసున్న వారు మాత్రమే ఈ గోవింద కోటి పథకానికి అర్హులు. గోవింద కోటి పుస్తకాలు టీటీడీ సమాచార, పుస్తక విక్రయ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. గోవింద కోటి పూర్తి చేసిన వారు ఆ పుస్తకాలను తిరుమలలోని టీటీడీ పేష్కార్ కార్యాలయంలో అందిస్తే మరుసటి రోజు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తారు.

భాషాపండితుల స్పాజ్ బదిలీలు చేపట్టండి

ఆర్‌యూపీపీ టీఎస్ వినతి

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : జీవో-317లో భాగంగా భాషాపండితుల స్పాజ్ బదిలీలు చేపట్టాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు- తెలంగాణ రాష్ట్రం(ఆర్‌యూపీపీ టీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ల బదిలీలను చేపట్టాలని కోరుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నియమించిన త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. అప్‌గ్రేడేషన్‌కు నోచుకోని 800 మంది భాషాపండితులను అప్‌గ్రేడ్ చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీ జగదీశ్, ప్రధాన కార్యదర్శి ములుకనూరి శంకర్ కోరారు.